

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



గోడన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం పాత ఆర్డీవో కార్యాలయంలో భద్రపరిచిన ఈవీఎంలను రాజకీయ పార్టీల నాయకులతో కలిసి కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్‌లను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ల వద్ద 24 గంటలూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు యోగేశ్వరి దేవి, ఎలెక్షన్ డిటి కనకరాజుతో పాటు వివిధ రాజకీయ పార్టీలు నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి రాజకీయ అంశం మళ్లీ తెరపైకి వస్తోంది. ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారా అనే చర్చ జోరుగా నడుస్తోంది.

ఇటీవల కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వరుస పర్యటనల నేపథ్యంలో ఆయన మరోమారు ఇక్కడి నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్నారా అన్న సంకేతాలు విన్పిస్తున్నాయి.

◆ మళ్లీ రాజకీయాల్లోకి వస్తున్నారంటూ ప్రచారం

◆ కళ్యాణదుర్గంలో వరుస పర్యటనలు

◆ 2029లో పోటీలో ఉంటారంటూ ప్రచారం

◆ నియోజకవర్గంలో సర్వత్రా చర్చ

తెరపైకి రఘువీరా..!

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

2009లో నియోజకవర్గాల పునర్ విభజన తర్వాత రఘువీరా కళ్యాణదుర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. రాష్ట్ర విభజన ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో 2019లో మరోమారు ఇక్కడి నుంచే పోటీచేసి రఘువీరా ఓడిపోయారు. అనంతరం ఆయన తన స్వగ్రామం మడకశిర నియోజకవర్గం నీలకంఠాపురానికి పరిమిత్తం అయ్యారు. కొన్నేళ్ల పాటు కళ్యాణదుర్గం వైపు కన్నెత్తి చూడలేదు. జిల్లానే కాదు రాష్ట్ర రాజకీయాలకూ దూరంగా ఉంటూ వచ్చారు. సుమారు ఆరేళ్ల తర్వాత ఆయన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వరుస పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మళ్లీ కళ్యాణదుర్గం నుంచి రాజకీయాన్ని ప్రారంభిస్తారా అన్న చర్చ జోరుగా నడుస్తోంది.

సేవ్ ఆర్డీటీ పాదయాత్రకు సంఘీభావం

ఈ నెల 15వ తేదీ మాజీ ఎంపి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త రంగయ్య 'సేవ్ ఆర్డీటీ' పేరుతో చేపట్టిన పాదయాత్రలో రఘువీరారెడ్డి పాల్గొన్నారు. గతంలో పలుమార్లు ఆయన ఇతర పార్టీల్లో చేరతారని ప్రచారం జరిగినా ఖండించారు. ఇంకా చెప్పాలంటే వైసిపి పేరు ఎత్తకుండానే జగన్ పార్టీ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇలాంటి పరిస్థితుల్లో రంగయ్య చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' పాదయాత్రకు మండలంలోని బాలవెంకటాపురం గ్రామం వద్ద సంఘీభావం తెలిపారు. ఆర్‌డిటిని కాపాడుకోవాలని చెబుతూనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార, ప్రతిపక్ష పార్టీలతో పాటు బాధ్యత గల పౌరులంతా ఆర్డీటీ కోసం పోరాడాలంటూ ప్రసంగం చేశారు. ఇక ఆదివారం నాడు కుందుర్పిలో జరిగే కామ్రేడ్ లక్ష్మన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలోనూ రఘువీరా పాల్గొననున్నారు.

మరోమారు దుర్గం నుంచి పోటీ చేస్తారా..?

2019 ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి ఒడిపోయిన ఆయన తర్వాత రాజకీయాలకు బ్రేక్ ఇచ్చారు. సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో 'నేను ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేశాను.. ఈ నియోజకవర్గ ప్రజలు మంచివారు.. ఎంతో విశ్వాసపాత్రులు.. వారికి మంచిచేయడం తప్ప మోసగించడం రాదు..' అంటూ నియోజకవర్గ ప్రజలను పొగిడారు. ఈ వాఖ్యలు కళ్యాణదుర్గం నుంచి ఆయన మరోమారు పోటీ చేసే ఆలోచనలో ఉంటి చేసినవే అంటూ రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

అభివృద్ధిలో రఘువీరారెడ్డి మార్క్

2009లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన రఘువీరారెడ్డి, మంత్రిగా ఐదేళ్ల పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేసి చెరగని ముద్ర వేసుకున్నారు. బళ్లారి-తుముకూరు రైల్వేలైన్, కళ్యాణదుర్గం పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు, కెజిబివిలు, మోడల్ పాఠశాలలు, పాలటెక్నిక్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, తిమ్మసముద్రంలో పరిశ్రమ ఏర్పాటుకు వెయ్యి ఎకరాల భూసేకరణ, రెవెన్యూ డివిజన్, సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కార్యాలయాలతో పాటు బిటిపి ప్రాజెక్టుకు డిఆర్‌పిల తయారీ, గ్రామీణ రోడ్లు, వివిధ భవనాలు, విద్యుత్ ఈఈ కార్యాలయం, నూతన రెసిడెన్సియల్ పాఠశాలలు మంజూరు చేయించారు. 11 ఏళ్ల క్రితం 2 వేల కోట్లకు పైగా నిధులతో ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేశారనడంలో అతిశయోక్తి లేదు.

అధికార, ప్రతిపక్షాల్లోనూ చర్చ

నియోజకవర్గంలో రఘువీరారెడ్డి వరుస పర్యటనల నేపథ్యంలో టిడిపి, వైసిపి ముఖ్యనాయకులు సైతం ఆయన గురించి చర్చించుకుంటున్నారు. ఒక వేళ రఘువీరా మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లో పూర్తి స్థాయిలో దిగితే కళ్యాణదుర్గం నుంచి 2029లో కాంగ్రెస్ తరఫున పోటీచేస్తారా లేదా అప్పటి పరిస్థితులను బట్టి వైసిపితో పొత్తులో పోటీ చేస్తారా.. లేక మరేదైనా నిర్ణయం ఉంటుందా అనే చర్చ జరుగుతోంది.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

జాకీ స్థానంలో రేమండ్ పరిశ్రమ

రూ.330 కోట్ల పెట్టుబడులు.. 3 వేల మందికి ఉపాధి

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు నియోజకవర్గానికి ప్రఖ్యాత గార్మెంట్స్ పరిశ్రమ రేమండ్ సంస్థ రాబోతోందని, గతంలో జాకీ పరిశ్రమ వచ్చిన ప్రాంతంలోనే ఇది ఏర్పాటు కాబోతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలియజేశారు. అనంతపురం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ప్రఖ్యాత రేమండ్ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. రాప్తాడు దగ్గర 26.87 ఎకరాలను ఎకరా రూ.20 లక్షల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రూ.330 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు అయ్యే ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 3వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాప్తాడు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని చర్యలూ తీసుకుంటున్నారని తెలియజేశారు. త్వరలోనే పేరూరు ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు అందించే పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఈ-స్టాంపు ట్యాంపరింగ్‌లో ముగ్గురు అరెస్టు

వార్త మెయిన్‌లో

'ఉపాధి'లో చేతివాటం..!

◆ పైసలు ఇచ్చుకో..మస్టర్ పెట్టుకో..

◆ ఆత్మకూరు మండలంలో హెచ్చుమీరిన అవినీతి

ప్రజాశక్తి-ఆత్మకూరు

కేంద్ర ప్రభుత్వం వలసల నివారణకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అవినీతి మయం అయ్యిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్మకూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని వేపచెర్ల, బి.యాలేరు, సనప, సంబంధిత గ్రామాల్లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి, సంబంధిత గ్రామస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ల సహకారంతో పాత పనులకు కొత్త బిల్లులు పెడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అధికార పార్టీ నాయకుల పెత్తనంతో యంత్రాలతో పనులు చేయిస్తూ నిధులు కాజేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో కూలీలకు పనులు చూపాలంటే రూ.200, జాబ్ కార్డులో పేరు రావాలంటే రూ.300 నుంచి రూ.500 వరకు క్షేత్రస్థాయి సిబ్బంది వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఉపాధి హామీ కూలీలను అడ్డం పెట్టుకుని బిల్లులు మంజూరు చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

వైసిపి తాటాకు చప్పుళ్లకు భయపడం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

వైసిపి తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం భయపడే స్థితిలో లేదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. వైసిపి నాయకులు నియోజకవర్గ పరిధిలో కార్యక్రమాలు నిర్వహించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రమాణ స్వీకారం రోజే పింఛన్లు పెంచామని గుర్తు చేశారు. గత వైసిపి హయాంలో రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఎగ్గొటడంతోపాటు రైతుల భూములను వారికే తెలియకుండా భూ మార్పిడి చేసేందుకు యత్నించారన్నారు. ఈనేపథ్యంలో తాము అధికారంలోకి వచ్చాక కుటుంబంలోని విద్యార్థులందరికీ తల్లికి వందనం నగదును తల్లుల ఖాతాలకు జమ చేశామన్నారు. గతంలో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి మరణిస్తే, మహిళలు వితంతు పింఛన్ల కోసం కన్నీళ్లతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదన్నారు. అయితే వ్యక్తి మరణిస్తే మరుసటి నెలలోనే భార్యకు వితంతు పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మరోవైపు అభివృద్ధి ఎక్కడా ఆగకుండా పరుగులు పెట్టిస్తున్నామన్నారు.

రైతు కుటుంబాల ఆనందమే లక్ష్యం : విప్

ప్రజాశక్తి-గుమ్మఘట్ట



రైతులకు కందులు పంపిణీ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రైతు కుటుంబాలు ఆనందంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని పూలకుంట గ్రామంలో ఉన్న ఆర్ఎస్‌కెలో రైతులకు సబ్సిడీ కందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా వేరుశనగలో అంతర్ పంటగా ఆముదం, కందిని వేసుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఒకవేళ ఏదైనా కారణంతో పంట నష్టపోతే మరో పంట ద్వారా కనీసం పెట్టుబడి ఖర్చయినా దక్కుతుందన్న ఉద్దేశంతో రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తారన్నారు. కంది సాగును ప్రోత్సహించాలన్నే ఉద్దేశంతో ప్రతి రైతుకూ 4 కిలోల చొప్పున కంది విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారన్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.1.07 కోట్లు, రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.11.90 లక్షల విలువైన విత్తన కందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా రైతుల ప్రయోజనం కోసం గత టిడిపి ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా 117 పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక వాటనింటినీ నీరుగార్చిందన్నారు. దీనికితోడు రాష్ట్రంపై రూ.10లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని అభివృద్ధి వైపు నడిపించటం ఎంత కష్టమో అర్థం అవుతోందన్నారు. కూటమిపై విశ్వాసంతో గత ఎన్నికల్లో ప్రజలు అనూహ్య మెజార్టీ ఇచ్చారన్నారు. ఆ విశ్వాసాన్ని నిలుపుకోవడానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కేంద్రం వద్ద తనకున్న పలుకుబడి, అనుభవంతో నిధులు తీసుకొచ్చి అభివద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకుపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి, వైస్‌ఛైర్మన్ దానవేంద్ర, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, తహశీల్దార్ రజాక్‌వలి, ఎంపిడిఒ రామకృష్ణ, మండల కన్వీనర్ గిరిమల్లప్ప, వీరాపురం సర్పంచు నాగరాజు, రాయదుర్గం పట్టణ అధ్యక్షులు పసుపులేటి రాజు, ఎంపిపి భవాని, కెపి దొడ్డి రాజు, చిన్ని కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూముల వేలంతో పెరిగిన ఆలయ ఆదాయం

ఉరవకొండ : మండలంలోని రేణుమాకులపల్లి గ్రామంలో ఉన్న పట్టణంలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి చెందిన సాగుభూమి వేలంతో ఆలయానికి ఆదాయం పెరిగిందని గ్రూప్ టెంపుల్స్ ఇఒ విజయ్‌కుమార్, దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి ఎ.కృష్ణయ్య తెలిపారు. శనివారం ఉరవకొండలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేణుమాకులపల్లి గ్రామంలో ఉన్న సుబ్రమణ్యం స్వామి దేవస్థానానికి సంబంధించిన 9.67 ఎకరాలు భూమిని కౌలుకు సాగు చేయడానికి బహిరంగ వేలం వేయగా రూ.1,62,400 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది ఇదే భూమి ద్వారా రూ.1,44,400 ఆదాయం వచ్చిందన్నారు. ఈ సారి రూ.18వేల ఆదాయం పెరిగిందని వివరించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

రాయదుర్గం రూరల్ : విద్యార్థులు విద్యాభ్యాసంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిధిలోని బొమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో డాక్యుమెంట్ రైటర్ ప్రకాష్ విద్యార్థుల కోసం తెచ్చిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై ఆరా..

నార్పల : మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో తాగునీటి సమస్యపై డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి ఆరాతీశారు. గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు ఎంపిడిఒ మమతాదేవి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు విన్నవించడంతో స్పందించిన ఎంపిడిఒ వెంటనే డిప్యూటీ ఎంపిడిఒతోపాటు ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్‌ను సమస్యను తెలుసుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు శనివారం నడింపల్లి గ్రామానికి చేరుకుని నూతన బోరు పాయింట్లతోపాటు పైప్‌లైన్ పనులను పరిశీలించారు.

పారా క్రీడలకు ముందుకు రావాలి

క్రీడా శాఖ జిల్లా ముఖ్య శిక్షకుడు ఉదయభాస్కర్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

దివ్యాంగులు పారా క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని క్రీడా శాఖ జిల్లా ముఖ్య శిక్షకుడు ఉదయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. ఈమేరకు పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర శనివారం అనంతపురానికి చేరుకున్న సందర్భంగా నగరంలోని ఇండోర్ స్టేడియంలో యాత్రకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా క్రీడాకారులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం క్రీడాకారుల కోసం ఇటీవల విడుదల చేసిన జిఒ 4 ద్వారా 3 శాతం ఉద్యోగాలను ఎలాంటి రాతపరీక్ష లేకుండా విద్యార్హతను ఇచ్చేందుకు అవకాశం కల్పించిందన్నారు. అలాగే పారా ఒలింపిక్స్, పారా ఆసియన్ గేమ్స్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన పారా క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. విశాఖపట్నంలో పారా క్రీడల కోసం 22 ఎకరాల్లో అత్యాధునిక స్టేడియం నిర్మించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, జిల్లా అధ్యక్షులు నాగరాజు, సెక్రటరీ శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాల్యాద్రినాయుడు, గుంటూరు జిల్లా సెక్రటరీ వై.శ్రీనివాస్‌గౌడ్, అథ్లెటిక్స్ కోచ్ మంజుల, జాతీయ పారా అథ్లెటిక్స్ మెడలిస్ట్ వెంకట్, వసతిగృహం వార్డెన్ సుభాషిని, సక్షం జిల్లా అధ్యక్షుడు సుంగు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, బుద్ధి మాన్వితుల స్కూలు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళం నడుమే సచివాలయ ఉద్యోగుల బదిలీలు

చాలా మండలాలు బ్లాక్ కావడంతో ఉద్యోగుల ఆందోళన

అభ్యంతరాలు వెల్లువెత్తడంతో తొలిరోజు ఆగిన కౌన్సిలింగ్



అధికారులను నిలదీస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామ సచివాలయం సంక్షేమ విద్యా సహాయకుల బదిలీల ప్రక్రియ గందరగోళం నడుమ ఆగింది. శనివారం సాంఘిక సంక్షమ శాఖ ఇన్‌ఛార్జి డీడీ రామాంజనేయులు శివరంగ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పని చేస్తున్న సంక్షేమ విద్యా సహాయకులకు బదిలీలు నిర్వహించారు. 5 ఏళ్లు సర్వీస్ పూర్తైన అభ్యర్థులు, రిక్వస్టింగ్ బదిలీ అభ్యర్థులు 635 మంది ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. తొలి రోజు అంగైవైకల్యం కలిగిన అభ్యర్థులు, స్పౌజ్, ఆప్షన్ కలిగిన అభ్యర్థులకు బదిలీలకు పిలిపించారు. ర్యాంక్ ఆప్షన్ ఆదారంగా అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. 27వ ర్యాంక్ అభ్యర్థి స్పౌజ్ ఆఫ్షన్ ఆధారంగా తనకు అనంతపురం రూరల్ ఇవ్వాల్సిన కోరాడు. కోరిన స్థానం లేదంటూ అధికారులు చెప్పడంతో తనకు ఎందుకు ఇవ్వరంటూ నిలదీశారు. ఏ స్థానం అడిగిన ఖాళీ లేదంటున్నారు ఏ నియమ నిబంధనల ప్రకారం బదిలీలు చేస్తున్నారంటూ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. మండలాలకు మండలాలు ఎలా బ్లాక్ చేస్తారంటూ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ర్యాంక్‌ల ఆధారంగా కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సులదీంతో బదిలీలు ఎలా చేపతారంటూ అభ్యర్థులు నిలదీశారు. అక్కడే బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గందరగోళం నెలకొనడంతో కౌన్సిలింగ్ ప్రక్రియ ఆగింది. అభ్యర్థులు కలెక్టరేట్ వరకు ర్యాలీ వెళ్లి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి విన్నవించారు. బదిలీల్లో తమకు అన్యాయం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ నియమ నిబంధనల ప్రకారమే బదిలీలు చేపడుతున్నామని కలెక్టర్ హామి ఇచ్చారు. సాయంత్రం తిరిగి ఉద్యోగ సంఘాల నేతలతో అధికారులు పిలిపించి మాట్లాడారు. ఉదయం నుంచి మహిళా అభ్యర్థులు వేచి ఉన్నారు. ర్యాంకుల ఆధారంగానే బదిలీలు చేపడతామని సూచించారు. ఎంత చెప్పినా మాట వినకపోవడంతో తొలిరోజు కౌన్సింగ్‌ను అధికారులు నిలిపివేశారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు కౌన్సిలింగ్ కాదు బదిలీల ప్రక్రియ చేస్తున్నప్పుడు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించే చేస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం బదిలీలు చేపడుతున్నప్పుడు ఉద్యోగులే ప్రజాప్రతినిధుల సిఫార్సుల లేఖలు ఇప్పించి ఇప్పుడు తమను ఇబ్బందులకు గురి చేయడం దేనికంటూ హితవు పలికారు. ఏ సిఫార్సులు లేకుండా చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నాయని ఆ ఆదేశాల ప్రకారమే నేడు బదిలీలు నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు 29వ తేది ఉదయం 8 గంటల నుంచి బదిలీల ప్రక్రియ చేపడతామని ఉద్యోగులు హాజరు కావాలని సూచించారు.



ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

రైల్వే క్లర్క్‌పై చర్యలు చేపట్టాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి రైల్వే డీజిల్ లోకో షెడ్ ఎన్నికల్లో రైల్వే ఉద్యోగి కేజీ రామచంద్ర పోటీలో నిలబడకుండా చేసిన రైల్వే క్లర్క్‌పై అధికారులు చర్యలు చేపట్టాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి ఉరుముల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేకు శనివారం పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముందుగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే డీజిల్‌షెడ్‌లో పని చేసే ప్రతి ఉద్యోగికీ రెండేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందన్నారు. షెడ్డులో టెక్నీషియన్‌గా పని చేస్తున్న రామచంద్ర తాను విధులకు చేరినప్పటి నుంచి ఇప్పటిదాకా సభ్యత్వ సొమ్మును ప్రతినెలా చెల్లిస్తున్నారని చెప్పారు. అయితే రైల్వే క్లర్కు పథకం ప్రకారం జనవరి నెలకు సంబంధించిన సభ్యత్వ సొమ్ము జమ చేయకుండా నిలుపుదల చేశారన్నారు. క్లర్కు తప్పు చేశారని షెడ్ డిఎంఇకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. రామచంద్ర దళితులు కావడం వల్లే ఎన్నికల్లో పోటీ చేయకుండా నివారించేందుకు పన్నాంగం పన్నారని ఆరోపించారు. తప్పు చేసిన క్లర్కుపై చర్యలు చేపట్టి రామచంద్రకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యోగ, దళిత, ప్రజాసంఘాలను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు రామాంజనేయులు, నారాయణస్వామి, రమేష్, రంగస్వామి, ఓబులేసు, రాము, విజయ్, రాజకుమార్, శేఖర్, సత్యరాజు, పాలడైరీ, నారాయణస్వామి, అడవి రాముడు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

శింగనమల : మండల పరిధిలోని శోదనపల్లి జెడ్‌పిహెచ్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న సురేష్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, వివేకానంద, రుక్మిణీదేవిని ప్రధాన ఉపాధ్యాయుల సిరాజ్ ఉద్దీన్ ధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గత కొనేళ్లుగా విద్యాభ్యాసం చేసిన ఉపాధ్యాయుల సేవలు మరువలేమవన్నారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెళకువలను నేర్చుకునిఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిటి బైపురెడ్డి, రాజేష్, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-గుంతకల్లు



వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఈస్టాంప్ బాండ్ పేపర్లను కొరత సృష్టించి ప్రయివేట్ స్టాంపు బాండ్ పేపర్ల వెండర్స్‌తో అధిక ధరలకు విక్రయించేందుకు సహకరిస్తున్న స్థానిక సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, అధ్యక్షులు చంద్ర మాట్లాడుతూ ఒకపక్క కళ్యాణదుర్గం పట్టణంలో నకిలీ స్టాంపులు కలకలం రేపుతుంటే స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ స్టాంపుల కొరత సృష్టించి ప్రైవేటు వెండర్లుతో అధిక ధరలకు విక్రయించడం దారుణమన్నారు. వాటిని అరికట్టాల్సిన సబ్ రిజిస్ట్రార్ ఈ స్టాంపు బాండ్ పేపర్ల విక్రయదారులు వత్తాసు పలుకుతూ మామూళ్లు వసూలు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే అధిక ధరలకు బాండ్ పేపర్లు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుని, లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు వంశీ, సహాయ కార్యదర్శులు రంగా, ఆది, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

ఉరవకొండ : ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు ఉరవకొండ పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక అంబేద్కర్ నగర్, నెహ్రూ నగర్‌లో పర్యటించి పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

రాయదుర్గం : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కావున దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని 16, 17వ వార్డు దుగిలమ్మ గుడి వీధి పరిధిలో స్థానికులకు మలేరియా, డెంగీ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారానికి మించి నీటిని నిల్వ చేస్తే దోమలు పెరుగుతాయన్నారు. కావున వారానికి ఒకసారి మన ఇంటి పరిసరాల్లోని తొట్టెలు, డ్రమ్ముల్లో నీటిని పారబోసి పూర్తిగా ఆరబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎర్రిస్వామి, సూర్యనారాయణ, ఆరోగ్య కార్యదర్శులు ప్రమీల, లలిత, శైలజ, ఆశా కార్యకర్తలు స్వాతి, శారద, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రైతు సంస్థలను బలోపేతం చేసుకోవాలి



మహాసభలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతులు రైతు సంస్థలను బలోపేతం చేసుకుంటే దళారి వ్యవస్థను నిర్మూలించవచ్చని సిఇఒ మురళి, ఎస్ఎడిఎల్ కో ఆర్డినేట్ రుద్రయ్య, అగ్రికల్చర్ స్పెషలిస్ట్ వీరభద్రారెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పిపిసిలో ఆత్మకూరు రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ 9వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆత్మకూరు మండల రైతుసంస్థలో 487 మంది వాటాదారులు ఉన్నారన్నారు. ఇందులో భాగంగా 2024-25 వార్షిక సంవత్సరంలో రైతుసంఘంలో జరిగిన వ్యాపార ఆర్థిక లావాదేవీల ఆడిట్ నివేదిక, పంటల క్రయ, విక్రయాల వివరాలను వాటాదారులకు వివరించారు. తర్వాత నూతన పాలకవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల టీం లీడర్ ఓబుళపతి, ఎఇఎ షామీర్, మేనేజర్ కళ్యాణ్‌కుమార్, రైతు సంస్థ సిఇఒ మంజునాథ్, మోహన్, నారాయణస్వామి, అనూషా, ఎస్‌టిఒలు చౌడయ్య, మల్లేష్, సబిహా, అకర్మా, మల్లికార్జున, 240 మంది వాటాదారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున



ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.24,500 ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి శనివారం పట్టణంలోని వినాయక కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలనుకుంటే ముందుగా మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నింటినీ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు వర్తింపజేయాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రతి మున్సిపల్ కార్మికునికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో జూలై 4న చలో విజయవాడ కార్యక్రమంతోపాటు నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, మైలారి, శివానంద, శ్రీనివాసులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల కమిటీల ఏర్పాటు



శింగనమల : వైసిపి మండల అధ్యక్షులుగా పూల ప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు అధినేత జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన అధినేత జగన్, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షులుగా నియమించినందుకు పార్టీకి ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు.



మైనార్టీ అధ్యక్షులుగా బంగారు అలిబాషా

నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన బంగారు అలిబాషా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త సాకే శైలజానాథ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిశీలించి పరిష్కారానికి పోరాటాలు చేస్తామన్నారు.

వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఆంజనేయులు



బుక్కరాయసముద్రం : వైసిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మంత్రి ఆంజనేయులు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా వరికూటి

వైసిపి ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా మండలానికి చెందిన వరికూటి కాటమయ్య నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్, రాష్ట్ర ఎన్ఆర్ఐ కో కన్వీనర్ ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పుట్లూరు మండల కన్వీనర్‌గా మహేశ్వర్‌రెడ్డి



కేక్ కోస్తున్న వైసిపి నాయకులు

పుట్లూరు : మండలంలోని జంగంరెడ్డిపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచు పొన్నపాటి మహేష్‌రెడ్డిని వైసిపి మండల కన్వీనర్‌గా నియమితులయ్యారు. దీంతో గ్రామస్తులతోపాటు వెల్లుట్ల, మడుగుపల్లి గ్రామాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అధినేత జగన్, సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్‌కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఎవర్ని రీకాలింగ్ చేయాలో ప్రజలకు తెలుసు : దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : ఎవర్ని రీకాలింగ్ చేయాలో ప్రజలకు బాగా తెలుసు అని.. అందుకే మీకు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. వైసిపి నాయకులు చేపట్టిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ముందు ఏం హామీలు ఇచ్చామో.. ఏవి నెరవేరుస్తున్నామో.. తమకు స్పష్టత ఉందని.. ఈ విషయం ప్రజలకు కూడా బాగా తెలుసున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ఐదు సంతకాలు కీలకమైన హామీలు నెరవేర్చేలా చేశారన్నారు. ఇందులో మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్‌ల ప్రారంభం, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి వాటిని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. జూన్ 12 నుంచి తల్లికి వందనం పథకం కూడా అమలు చేస్తున్నామన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటివి కూడా అమలు కాబోతున్నాయన్నారు. ఇవన్నీ తట్టుకోలేక రీకాలింగ్ అంటూ కొత్త నాటకాలకు వైసీపీ నాయకులు తెర లేపారన్నారు. వైసిపి నాయకులు ప్రజల్లో రోజురోజుకీ పలుచన అవుతున్నామనే భావనతో ప్రభుత్వంపై ఏదో ఒక దుష్ప్రచారం చేయాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

కుళ్లాయి స్వామి ఉత్సవాలను విజయవంతం చేయండి



నార్పల : మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ సర్పంచు రమణ కుమారి శివయ్య పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే మత సామరస్యానికి ప్రసిద్ధి చెందిన కుళ్లాయిస్వామి ఉత్సవాలు ఎంతో ప్రతి చెందాయన్నారు. కుల మతాలకు అతీతంగా దేశంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారన్నారు. భక్తులందరికీ కుళ్లాయిస్వామి కృప, కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. కాగా భక్తుల సౌకర్యార్థం గూగూడులో అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు.

విచారించారే తప్ప.. కొట్టలేదు.. : సిఐ

పెద్దవడుగూరు : పెద్దపప్పూరుకు చెందిన వంశీ అనే యువకుడిని ఓ మైనర్ మిస్సింగ్ కేసులో కేవలం విచారించారే తప్ప పోలీసులు కొట్టలేదని సిఐ రామసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపప్పూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ మైనర్ కనిపించకుండా పోయిందన్నారు. దీంతో తమ అమ్మాయి ఆచూకీ కనుగొనాలని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పెద్దపప్పూరు ఎస్.నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను దర్యాప్తు చేసేందుకు ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా అనుమానితుల్లో ఒకరైన వంశీని విచారించారన్నారు. అంతేగానీ పోలీసులు అతడిని కొట్టలేదన్నారు.

మాజీ సర్పంచి మృతికి నివాళి

కణేకల్లు : మండల పరిధిలోని గరిచేడు పంచాయతీకి చెందిన వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కణేకల్ మాజీ ఎంపిపి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి సతీమణి, మాజీ సర్పంచు ఆలేరి విజయలక్ష్మి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి విజయలక్ష్మి మృతదేహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ఆమె పాడె మోశారు. కాగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డి, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



పాడె మోస్తున్న కాపు రామచంద్రారెడ్డి

విజయం సాధించే వరకూ ప్రయత్నం ఆపొద్దు

'శ్రీధర్స్ సిసిఇ' సక్సెస్ మీట్‌లో ఎస్పీ జగదీష్



శ్రీధర్స్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుని ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం

యువత విజయం సాధించే దిశలో ప్రయత్నాలను ఆపకుండా కృషి చేస్తే విజయం దరి చేరుతుందని ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని లలిత కళాపరిషత్‌లో శ్రీధర్ సిసిఇ సంస్థ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ విజయం సాధించాలంటే సులువైన విషయం కాదన్నారు. అందుకు నిరంతర కృషి, తపన అవసరం అన్నారు. ఇందుకు తానే ఓ ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. సాధారణ కుటుంబం నుంచి ఎస్పీ స్థాయి అధికారిగా అనేక కష్టాలను అధిగమించి వచ్చానన్నారు. నేటి యువత ప్రలోభాలకు లొంగకుండా ఉపాధి సాధన దిశగా సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 30ఏళ్లుగా వేలాది మందిని ఉద్యోగులను తీర్చిదిద్దుతున్న శ్రీధర్స్ సిసిఇ సంస్థ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. శ్రీధర్స్ సిసిఇ సంస్థ డైరెక్టర్లు శేష కుమార్ అరవింద్ బాబును అభినందించారు. శ్రీరస్తు సంస్థ ఫౌండర్ శ్రీధర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో తమ సంస్థ వేలాది మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు పొందేలా కృషి చేసిందన్నారు. తమపై నమ్మకాన్ని ఉంచి శిక్షణ కోసం పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం శ్రీధర్స్ సిసిఇ సంస్థ డైరెక్టర్లు శేషుకుమార్, అరవింద్‌బాబు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అనంతపురంలో ప్రతిఏటా వందలాది మంది అభ్యర్థులను క్షేత్రస్థాయిలో శిక్షణ అందించి ఉద్యోగార్థులుగా తయారు చేయడం తమకు దక్కిన అవకాశమన్నారు. తల్లిదండ్రుల కళ్లల్లోని ఆనంద బాష్పాలు తమకు మరింత బాధ్యతను పెంచుతున్నాయన్నారు. అనంతరం శ్రీధర్స్ సిసిఇ సంస్థ ద్వారా శిక్షణ పొంది ప్రభుత్వ బ్యాంకులతోపాటు పలుసంస్థల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఎస్పీతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్స్ సిసిఇ సంస్థ వ్యవస్థాపకులు సీతారామిరెడ్డి, హైదరాబాద్ డైరెక్టర్ సుధీర్ చక్రవర్తి ఒంగోలు డైరెక్టర్ రాజేంద్ర, రాజమండ్రి డైరెక్టర్ రాము, అనంతపురం శ్రీధర్స్ సిసిఇ సంస్థ సిబ్బంది శంకర్‌రెడ్డి, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు

ముఖ్యమంత్రి సహాయనిధి అనేకమంది పేదలకు ఆర్థిక భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శనివారం స్థానిక పరిటాల కళ్యాణ మంటపంలో నియోజకవర్గ స్థాయి టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లోని 23మంది లబ్ధిదారులకు రూ.21.64 లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. గత వైసిపి హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర, నియంతృత్వ పోకడలతో పాలన సాగించారన్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్న స్థితికి చేరుకుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకవైపు అభివృద్ధితోపాటు రెండోవైపు సంక్షేమాన్ని అందిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని 221 మంది పేదలకు రూ.1.92 కోట్ల సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు విడుదల చేశారన్నారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులు ఎక్కువ శాతం సిఎం రిలీఫ్ ఫండ్ సాయం కోరే అర్జీలే వస్తున్నాయన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశానికి అధికారులు రాకుంటే ఎలా.. : ఎంపిపి


ప్రజాశక్తి-గుత్తి

మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికే మండల అధికారులు హాజరు కాకపోతే ఎలా అని ఎంపీపీ జి.విశాలాక్షి ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధికశాతం మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో వారిపై ఎంపిపి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సమావేశానికి హాజరయ్యేందుకు గంట సమయం కేటాయించలేకపోతున్నారంటే ఇక ప్రజా సమస్యలపై వారికి ఎంత నిబద్ధతగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. అలాంటి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలా ఉన్నారో దీన్ని బట్టి తెలుస్తోందన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలనే అధికారులు పరిష్కరించాలని అలాంటిది అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఎంపిపి తీవ్రంగా మండలించారు. మండల సమావేశం కంటే ముఖ్య పనులు ఏమున్నాయని ఐదు శాతం కూడా అధికారులు హాజరు కాకపోతే ఎలా అని ప్రశ్నించారు.అనంతరం జరిగిన సమావేశంలో సభ్యులు గ్రామాల్లోని పలు సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.ప్రభాకర్, వైస్ ఎంపిపిలు ఎస్.తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, సర్పంచులు అప్పా వెంకటేష్, ఎం.గోపాల్, వాసుదేవరెడ్డి, ఆర్.గురుమస్తాన్, ఆంజనేయులు, నగరూరు సుమలత, లావణ్య, ఎంపిటిసి సుమలత, ఇఒఆర్‌డి నరసింహారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎపిఒ రమేష్, ఎక్సైజ్ ఎస్ఐ అస్లాంబేగ్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల నియంత్రణకు వినతి

రాయదుర్గం : పట్టణంలోని ప్రధాన రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు, బిసివై పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రటకనలో విజ్ఞప్తి చేశారు. ప్రధాన రోడ్లపై పశువులు, కుక్కలు, పందులు, గాడిదల సంచారంతో స్థానిక ప్రజలు విసుగు చెందారన్నారు. రోజూ ఎక్కడో ఒకచోట ప్రాణాల మీదకి తెస్తున్న కుక్కలు ఆవుల విచ్చలవిడి సంచారం నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఇటీవల తిరుపతిలోని ప్రధాన రోడ్డుపై కొన్ని ఆవులు మనిషి పై చేసిన దాడి ఘటనకు సంబంధించిన వీడియో ప్రజలను ఎంతో భయాందోలనాలకు గురి చేసే విధంగా ఉందన్నారు. ఇలాంటి ఘటనలు రాయదుర్గంలో జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంతటా బదిలీల సందడి ..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అంతటా అదే సందడి నెలకొంది. ఇప్పటికే జిల్లా అధికారుల బదిలీలు పూర్తయ్యాయి. ఇప్పుడు తక్కిన ఉద్యోగుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయ బదిలీల్లో అంతటా అయోమయం, గందరగోళం కొనసాగింది. వాటిని సరిచేసే ప్రక్రియను అధికారులు చేపడుతున్నారు. ఇక సచివాలయ ఉద్యోగ బదిలీలకు కౌన్సిలింగ్ నడుస్తున్నాయి. అన్ని శాఖల్లో బదిలీలు నడుస్తుండటంతో అంతటా అదే హడావుడి నెలకొంది. ఇక ఈ బదిలీల్లో తాము అనుకున్న స్థానాలకు బదిలీ అయ్యేందుకు ఉద్యోగులు సిఫారసుల కోసం పెద్దఎత్తున నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో తాము కోరుకున్న ప్రాంతానికి వెళ్లే ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. కోరుకున్న స్థానం లభించిన వారు ఆనందంలో ఉండగా రాని వారు అసంతృప్తితో ఉన్నారు.

రాజకీయంగా చూసినప్పుడు వైసిపి తమ కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఏడాది పాలనపై వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించిన వైసిపి ఇప్పుడు క్షేతస్థాయికి వెళ్లేందుకు సమయత్తం అవుతోంది. అందులో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, రాయలసీమ సమన్వయకర్త అయిన మిథున్‌రెడ్డిలు అనంతపురం జిల్లా విచ్చేశారు. బుక్కరాయసముద్రంలో శింగనమల నియోజకవర్గ కార్యాలయం ప్రారంభమైన తరువాత 'రీకాలింగ్ చంద్రబాబు హామీలు' పేరుతో కార్యక్రమాన్ని రూపొందించి వచ్చే నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ ఎమ్మెల్యేలు వెళ్లాలని నిర్ణయించింది. అంతలోపు రీకాలింగ్ చంద్రబాబు హామీల పేరుతో ప్రభుత్వం ఏడాదిలో చేయని హామీలను ప్రజలకు గుర్తు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, చివరకు గ్రామ స్థాయి వరక వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు సిద్ధమయ్యాయింది. ఇందుకోసం క్యూఆర్ స్కానర్‌ను పెట్టి ఏడాది వైసిపి ప్రభుత్వం లేకపోవడం వలన కుటంబానికి ఎంత నష్టం జరిగిందని వివరించే పనిని చేపట్టింది. దీన్ని అధికార టిడిపి ఏ రకంగా తిప్పికొడుతుందో చూడాల్సి ఉంది. వైసిపి చేస్తున్న ప్రధాన ప్రచారంలో అన్నదాత సుఖీభవ ఇవ్వలేదని పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లో విడుదల చేస్తామని ముందుగా ప్రకటించింది. కేంద్రంతో కలిపి ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అమలు జరగలేదు. ఇక ఇతర హామీల అమలుపైనా వైసిపి చేస్తున్న ప్రచారాన్ని టిడిపి ఏ రకంగా తిప్పికొడుతుందో చూడాల్సి ఉంది.

సిపిఎం ఆధ్వర్యంలో ఈ వారంలో 50 ఏళ్ల ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు నేడు ఉన్నాయంటూ అనంతపురం నగరంలో సభను నిర్వహించింది. ఈ సభకు సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. సిపిఐ అనంతపురం నగర మహాసభను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.

నేరాలు ఘోరాలు

కుళ్లాయిస్వామి స్నానాల బావిలో పడి వ్యక్తి మృతి



బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీస్తున్న యువకులు

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి స్నానాల బావిలో పడి వడ్డీ రాజశేఖర్ (45) మృతిచెందాడు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల మేరకు.. గూగూడుకు చెందిన రాజశేఖర్ ప్రమాదవశాత్తు కుళ్లాయిస్వామి స్నానాల బావిలో పడి మృతిచెందాడు. గమనించిన గ్రామ యువకులు మృతదేహాన్ని వెలికితీశారు. మద్యం తాగి ప్రమావశాత్తు పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం తరలించి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే స్నానాలు బావిలో పడి వ్యక్తి మృతి చెందడంతో గూగూడు గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

ఉత్సవాలు ముగిసే వరకూ మద్యం విక్రయాలు బంద్

కుళ్లాయిస్వామి ఉత్సవాలు ముగిసేంత వరకూ గూగూడులో మద్యం విక్రయాలను నిలిపి వేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గూగూడులో మద్యం దుకాణం నిర్వహణపై ఇప్పటికే పత్రికల్లో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. దీనికితోడు గూగూడుకు చెందిన రాజశేఖర్ మద్యం మత్తులోనే బావిలో పడి మృతిచెందాడనే చర్చ సాగుతోంది. ఈనేపథ్యంలో ఉత్సవాలు ముగిసే వరకూ గ్రామంలో ఎలాంటి మద్యం విక్రయాలు కొనసాగించరాదని ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంది పంట ధ్వంసం

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని దోసలోడికి గ్రామంలో అన్నదమ్ముల ఆస్తి వివాదం నేపథ్యంలో రైతు యడవలి నాగరాజు సాగు చేసిన ఎకరా పొలంలోని కంది పంటను శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని సర్వేనెంబర్ 60లో తల్లి భాగానికి వచ్చిన ఎకరం భూమిని రైతు నాగరాజు కౌలుకు సాగు చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం భూమి రైతు కుమారుడు నిశ్చితార్థం కోసం కర్నూలు జిల్లా ఇంద్రంపల్లి గ్రామానికి కుటుంబం, బంధుమిత్రులతో కలిసి వెళ్లాడు. ఇదే అదునగా చూసుకుని అతని అన్న కొడుకులు రాజు, ధనుంజయ కంది పంటను ట్రాక్టర్‌తో దున్ని వేశారు. ట్రాక్టర్ యజమాని అనుమతి లేకుండా ట్రాక్టర్లు తీసుకురావడంతో ట్రాక్టర్ యజమాని అడ్డుకున్నాడు. సాయంకాలం ఇంటికి వచ్చిన రైతు నాగరాజు విషయం తెలుసుకుని కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై దాడి

గుత్తి : మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ డాబా హోటల్ నిర్వాహకురాలుపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. ఊబిచెర్ల గ్రామానికి చెందిన ఓబులేసు, అంజలి దంపతులు గ్రామశివారులో జాతీయ రహదారి పక్కన డాబా హోటల్ పెట్టుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో అంజలి రాత్రి డాబా మూసి అక్కడే నిద్రించింది. అయితే అర్ధరాత్రి సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి డాబాను ధ్వంసం చేశారు. డాబాలోని వస్తువులు చిందరవందరగా పడేశారు. వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి డాబాను తగులబెట్టేందుకు ప్రయత్నిస్తుండగా అలికిడి కావడంతో అక్కడే నిద్రిస్తున్న అంజలి గమనించి బిగ్గరగా కేకలు వేయడంతోపాటు అడుకుంది. దీంతో వారు అంజలిని విచక్షణా రహితంగా దాడి చేశారు. కేకలు విన్న సమీపంలోని వారు రాగా గమనించిన వారు ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. గుర్తు తెలియని దుండగుల దాడిలో గాయపడిన అంజలిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే డాబాపై దాడికి పాల్పడిన వారు దొంగలా లేక ఇతర కారణాలతో దాడి చేశారా అనేది పోలీసులు విచారణలో తేలాల్సి ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.